పంచాయితీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి
నైపుణ్య గణన పై శిక్షణ

విశాలాంధ్ర-భోగాపురం: మండలంలో పంచాయితీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సోమవారం ఎంపీడీవో కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాధాన్యత స్కిల్ సెన్సస్ సర్వే (నైపుణ్య గణన) పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 15 నుండి 59 సంవత్సరాలు వయస్సు గల ప్రతి ఒక్కరికీ నైపుణ్య గణన సర్వే చేసి అంతర్జాలంలో జాబితాను నమోదు చెయ్యాలని తెలిపారు. ఆన్లైన్ లో నమోదు అనంతరం లబ్ధిదారుల శిక్షణ అందించి వారి ఆసక్తి మేరకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ పిఆర్డీ గాయత్రి, పంచాయితీ కార్యదర్శులు , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యక్షా..! మా ఎస్.కోటను విశాఖజిల్లాలో కలపండి
అసెంబ్లీలో ఎమ్మెల్యే లలితకుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్/జామి: ఎస్‌కోట నియోజకవర్గాన్ని విశాఖజిల్లాలో చేర్చాలనే అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. గతవైసీపీ ప్రభుత్వం పార్లమెంట్ పరిది ఒక జిల్లాగా నిర్ణయించింది. అయితే విశాఖ పార్లమెంట్‌లో ఉన్న ఎస్‌కోట అసెంబ్లీ నియోజక వర్గాన్ని మాత్రం విజయనగరం జిల్లాలోనే వదిలేసింది. దీనిపై గతంలోనే మాజీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనూ కోళ్ళలలిత కుమారి అనేక విన్నపాలు చేసారు. కానీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతోపాటు తాజా అసెంబ్లీ సమావేశాలలో సోమవారం స్థానిక ఎస్‌కోట నియోజకవర్గ శాసనసభ్యు రాలు కోళ్ళలలితకుమారి మరోసారి ఈఅంశాన్ని లేవనెత్తారు. పార్లమెంట్ ఒక జిల్లాగా చేసారు కాబట్టి తమ ఎస్‌కోట నియోజకవర్గాన్ని విశాఖలో కలపాలని ఆమె సభాముఖంగా కోరారు. నిత్యం తమ నియోజకవర్గంలోని 5మండలాలనుంచి అధిక శాతం మంది ఉపాధి కోసం విశాఖనుంచి రాకపోకలు చేస్తున్నారని ఆమె వివరించారు. విశాఖలో కలపడం తమకు అభ్యంతరంలేదని వివరించారు. అసెంబ్లీలో నియోజకవర్గ విషయాన్ని లేవనెత్తడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేసారు.

మెరకముడిదాంలో అపారిశుధ్యం
ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే

విశాలాంధ్ర -మెరకముడిదాం: మండలంలో చాలావరకు గ్రామాలకు ఎటుచూసినా చెత్త కుప్పలు మురుగు నీరు దర్శనమిస్తున్నాయి. మెరక ముడిదాం మండలంలో చాలా గ్రామాలకు ఉన్నత అధికారులు ప్రజాప్రతినిధులు వస్తే తప్ప పారిశుధ్యం గురించి పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని రోడ్డుకి ఇరువైపులా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో పాటుగా రాకపోకలు సాగించే వారంతా ముక్కు మూసుకొని ముందుకు సాగవలసి వస్తుంది. అపరిశుభ్ర వాతావరణంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి పారిశుధ్య మెరుగుకు కృషి చేయాలని స్థానికులు చెబుతున్నారు.

ప్రజా గ్రీవెన్స్‌కు 205 వినతులు : కలెక్టర్
ఎంఎస్ఎంఈ, స్కిల్ సర్వే లు పక్కాగా జరగాలి : జేసి



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రజా ఫిర్యాదుల విబాగానికి వచ్చిన వినతులకు నాణ్యమైన, ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ఏ వినతులు ఆ రోజే అధికారులు ఓపెన్ చేయాలని, ఎక్కువగా రెవిన్యూ కు చెందిన వినతులే వస్తున్నాయని, తహసిల్దార్లు ఈ విషయం లో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. సోమవారం ప్రజా వినతులు పరిష్కార వేదిక లో భాగంగా సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ అధికారులతో మాట్లాడారు. ఎం.ఎస్.ఎం.ఈ సర్వే మర్చి నెలాఖరులోగా పూర్తి చేయాలనీ తెలిపారు. అందుకు అవసరమయ్యే మార్గదర్శకాలు త్వరలో విడుదల చేస్తామని, శిక్షణలు కూడా ఇస్తామన్నారు. జిల్లాలో 48 రీచ్లు అందుబాటు లో ఉన్నాయని, ప్రతి రీచ్ కు ఒక గ్రామ కార్యదర్శిని ఇంచార్జ్ గా పెట్టడం జరిగిందని, ఉచిత ఇసుక ను పొందడానికి కార్యదర్శి వద్ద నుండి పొందిన రసీదును తీసుకొని ఇసుకను పొందవచ్చునని తెలిపారు. లోకాయుక్త కేసులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించుకోవాలని ఆయా అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్, జేసి సేతు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 205 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 144 ,వినతులు అందాయి. పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్డిఏకు 10 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 08 , పంచాయితీ శాఖకు 06 , విద్యా శాఖకు 10 అందగా, వైద్య శాఖకు 6 అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి.

అంగన్వాడి కేంద్రంలో మొక్కలను నాటిన ఐసిడిఎస్ పీఓ ఆరుద్ర



విశాలాంధ్ర-గుర్ల: చైల్డ్ రైట్స్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నడుపూరు అంగన్వాడి కేంద్రంలో ప్రాజెక్టు అధికారి ఆరుద్ర మొక్కలను నాటారు ప్లాంటేషన్ పర్యావరణం పరిరక్షిందుకు అంగన్వాడి ఆవరణలో మొక్కలు నాటారు ఈ కార్యక్రమం లో సూపర్వైజర్, అంగన్వాడి కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వేదికకు పలు వినతులు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి మూడు వినతులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి రెండు వినతులు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చాయి. వీటిని స్వీకరించిన కమిషనర్ పల్లి నల్లనయ్య సమస్యల పరిష్కారానికై ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మంగళవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయం నందు వరల్డ్ టాయిలెట్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య శ్రామికులకు ఈ సందర్భంగా సత్కరించనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి,ఈఈ టి. రాయల్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బేబీ నాయన వితరణ



విశాలాంధ్ర -తెర్లాం : మండలంలో కూనయవలస గ్రామంలో ఇటీవల కుక్కలు కరిచి 12 గొర్రెలు చనిపోయిన సంగతి తెలిసినదే. స్పందించి ఎమ్మెల్యే బేబీ నాయన సొంత డబ్బులు 15 వేల రూపాయలు మండల నాయకులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్ వెంకట్ నాయుడు, మాజీ ఎంపీపీ ఎన్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బాధితులు బమ్మిడి అప్పన్న, ముడిసి వెంకటేష్ కు సోమవారం అంద చేశారు. వీరితో స్థానిక నాయకులు మాజీ ఎంపీపీ బోడెలా. సింహాచలం, తెలుగుదేశం పార్టీ నాయకులు బోడెలా రవి, చిన్నారావు, ఈశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వసతిగృహాల భవనాల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపండి
రక్తహీనత, బాల్య వివాహాల పై దృష్టి పెట్టాలి
సంక్షేమ, వైద్య, ఆరోగ్య శాఖల ప్రణాళికలపై కలెక్టర్ సమీ

విశాలాంధ్ర-విజయనగరం: సాంఘిక సంక్షేమ వసతి గృహాలస్వంత భవనాల నిర్మాణాలకు, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు జిల్లాలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ 30 ఉండగా 7 స్వంత భవనాల కోసం ప్రతిపాదనలు ఇదివరకే పంపినట్లు ఆ శాఖ డి డి తెలుపగా, 3 లక్షలరూపాయల లోపు మరమ్మతులు ఉన్నవాటిని గుర్తించి వెంటనే ప్రతిపాదనలను పంపాలని డి డి కు సూచించారు. సోమవారం కలెక్టర్ తన ఛాంబర్ లో ఏడాది కార్యాచరణ ప్రణాళిక పై సాంఘిక సంక్షేమ, బి.సి సంక్షేమ, గిరిజన సంక్షేమం, వికలాంగుల, మైనారిటీ ల సంక్షేమ శాఖల అధికారులతో మరియు వైద్య ఆరోగ్య , ఐ.సి.డి.ఎస్ శాఖల అధికారులతో సమీక్షించారు. అలాగే 19 బిసి వసతి గృహాల భవనాల కోసం కూడా వెంటనే డి.ఓ లేఖ రాయాలని సూచించారు. అదే విధంగా వసతి గృహాలలో కనీస సదుపాయాల కల్పనకు కూడా చర్యలు చేపట్టాలని తెలిపారు. వాటి కోసం కూడా ప్రతిపాదనలు తాయారు చేసి ఆయా శాఖల హెచ్.ఓ.డి లకు డి.ఓ లేఖలు రాయాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతి నెల వసతి గృహాలను తనిఖీ చేస్తున్న నివేదికలను కూడా హెచ్.ఓ.డి లకు పంపాలన్నారు. ఎస్.సి ఫైనాన్సు కార్పొరేషన్, సఫాయి కర్మచారి ఫైనాన్సు కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందిన వారు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, రుణాలు పొందిన వారు చెల్లిస్తేనే తదుపరి మిగిలిన వారికీ రుణాలు లభిస్తాయని తెలిపారు. ఎస్.సి ఫైనాన్సు కార్పొరేషన్ నుండి 7 కోట్ల రూపాయలు, సహాయి కర్మచారి కార్పొరేషన్ నుండి 5.5 కోట్ల రూపాయలు రునలుగా ఇవ్వడం జరిగిందని, వారు పూర్తిగా చెల్లించవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశం లో సి.పి.ఓ బాలాజీ , జిల్లా బి.సి సంక్షేమ, సాంఘిక సంక్షేమ, వికలాంగుల సంక్షేమ, మైనారిటీ సంక్షేమ , బిసి. ఎస్.సి కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

రక్తహీనత, బాల్య వివాహాల పై దృష్టి పెట్టాలి

వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సమీక్ష లో భాగంగా గర్భిణీల లో, తల్లుల్లో, అంగన్వాడీ బాలల్లో రక్త హీనత శాతం తగ్గేల చూడాలని, అదే విధంగా బాల్య వివాహాలను తగ్గించాలని తెలిపారు. సెక్స్ రేషియో లో బాలికల శాతం పెరగాలని తెలిపారు. అంగన్వాడీ లలో అండర్ వెయిట్ ఉన్న బాలల పై ప్రత్యేక దృష్టి పెట్టి బరువు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇమ్యూనైజేషన్ శత శాతం జరగాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్ల నిర్మాణాలను వెంటనే మొదలు పెట్టాలని , త్వరగా మౌలిక సదుపాయాలను పూర్తి చేయాలనీ తెలిపారు. సంక్రమిత వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశం లో సి.పి.ఓ బాలాజీ, ఇంచార్జ్ డి.ఎం, ఐ.సి.డి.ఎస్. పి.డి శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం
యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సివిల్ సప్లయ్స్ లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మెకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్స్ హమాలీస్ యూనియన్ ఆఫ్

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి పి.కామేశ్వరరావు హెచ్చరించారు. హమాలీల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సోమవారం దాసన్నపేట వద్ద ఉన్న స్థానిక సివిల్ సప్లై కూడా వద్దనుండి జిల్లా మేనేజర్ కార్యాలయం ర్యాలీ నిర్వహించి, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ ఎస్ రాజీకి సమ్మె నోటీసును సమర్పించారు. ఈ సందర్భంగా పి.కామేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై హమాలీలుగా సుమారు 4 వేల మంది, ఉమ్మడి విజయనగరం జిల్లాలో 300 మంది హమాలీలు పనిచేస్తున్నారన్నారు. అయితే హమాలీలకు ప్రతి రెండేళ్లకు ఓసారి కూలి రేట్ల ఒప్పందం జరుగుతుందని, ఈ ఒప్పం దం 2023 డిసెంబరుతో పూర్తి అయిందని, కానీ, ఇప్పటికీ కూడా కూలి రేట్ల నూతన ఒప్పందం తీసుకురాకపోవడం అత్యంత బాధాకరమన్నారు. దీని కోసం పదిసార్లు సివిల్ సప్లై కార్పొరేషన్ ఎండి , అధికారులకు వినతులు అందజేసినా కూడా ఫలితం లేక పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వారంలో ఎరియర్స్ తో సహా, కొత్త రేట్ల ఒప్పందం తెచ్చి లోడింగ్, అన్లోడింగ్ బకాయిలతో చెల్లించాల్సిందేనన్నారు. కూలి రేటు రూ.2లు పెంచుతామని కూటమి ప్రభుత్వం చెబుతోందని, ఇదిచాలదని, దీనిని వ్యతిరేకిస్తూ ప్రతిఘ టిస్తామని హెచ్చరించారు. ప్రతి నెల పదవ తేది లోగా లోడింగ్, అన్‌లోడింగ్ బిల్లులు చెల్లించాల్సిందేనని, వచ్చేనెల డిసెం బరు నెల పదిలోగా చెల్లించకుంటే ఆకస్మికసమ్మెకు దిగుతామని తెలియ జేశారు. రాష్ట్రస్థాయిలో చర్చలకు మంగళవారం తమ రాష్ట్ర నాయ కత్వం వెళ్తోందని, అక్కడ చర్చలు సఫలం కాకుంటే మెరుపు సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముల్లు నర్సింహులు, గోపి, శ్రీరామ్, నాగేశ్వరరావు, వెంకటస్వామి, తాతారావు,రామకృష్ణ, సిహెచ్ రాజు తదితర ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న సివిల్ సప్లై కార్మికుల పాల్గొన్నారు.

అఖిల భారత అంతర విశ్వవిద్యాలయ క్రాస్ కంట్రీ పోటీలకు సీతం విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ కోర్స్ చదువుతున్న ఎమ్.సాయి యశ్వంత్ అనే విద్యార్థి అఖిలభారత అంతర విశ్వవిద్యాలయ స్థాయిలో పోటీలకు అథ్లెటిక్స్ విభాగంలో క్రాస్ కంట్రీ ఈవెంట్ లో పదివేల మీటర్లు కు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి తెలియజేశారు. ఈ పోటీలు ఈనెల 18,19వ తేదీల్లో ఎస్.ఆర్.టి.ఎమ్ యూనివర్సిటీ,నాందేడ్, మహారాష్ట్రలో జరగనున్నాయి. సాయి యశ్వంత్ జేఎన్టీయూ గురజాడ విశ్వవిద్యాలయం తరపున ఈ పోటీలలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు విద్యార్థిని ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలుసాధించాలని తమ కళాశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రత్యేక బహుమతితో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్స్ మహేశ్వర రావు, శ్రీదేవి,సి.ఎస్.ఓ సత్యనారాయణ, డాక్టర్ ఎల్. సత్యవతి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి రాధ, ఇతర అధ్యాపకులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న మహిళ ను అందుకొని మానవత్వం చాటుకున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర -బొబ్బిలి: పట్టణం వాసు కాలేజ్ దగ్గర ఓ మహిళ ఫిట్స్ వచ్చి కరెంటు స్తంభాన్ని గుద్దుకుంది,తలకి గాయమై శరీరం మొత్తం రక్తం, కావడంతో. సృహ తప్పి పడిపోవడంతో అసలు నోటిలో నుంచి మాట కూడా రావడం లేదు,ఈ సందర్భం ఏఐఎస్ఎఫ్ నాయకులు చూసి హుటాహుటిన దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.అలాగే పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇచ్చి వాళ్ల కుటుంబ సభ్యులకు అప్పచెప్పే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దింతో అఖిల భారత విద్యార్థి సమైక్య నాయకులను పలువురా అభినందించారు. విద్యార్థి సమస్యలపై పోరాటాల కదని మానవ సేవలో ముందంజలో ఉంటామని మరోసారి నిరూపించారు.

సభ్యత్వ నమోదుపై బీజేపీ సమావేశం

విశాలాంధ్ర -రాజాం : భారతీయ జనతా పార్టీ మెంబర్ షిప్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం రాజాం అసెంబ్లీ పరిధిలో నాలుగు మండలాల బిజెపి కార్యకర్తల సమావేశం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, విజయనగరం జిల్లా ఎలక్షన్ అధికారి పైడి వేణుగోపాల్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యత్వం క్రియాశీల సభ్యత్వం గురించి నియోజకవర్గ కార్యకర్తలు కు నాయకులకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా క్రియాశీల సభ్యత్వం సహా ప్రముఖ సంపత్ రావు నాగేశ్వరరావు క్రియాశీల సభ్యత్వం మీద దిశ నిర్దేశం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాజాం బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ జొన్నాడ రంజిత్ పార్టీ విస్తరక వేమకోటి గిరిబాబు జిల్లా కార్యదర్శి గుడివాడ నాగరాజు కె. సత్యనారాయణ, ఎం.ఉదయ్ కుమార్, సిహెచ్.సత్యనారాయణ, వి.దాలియ. వై. కుమారి, ఎల్.శారద కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

జాతీయ బాక్సింగ్ పోటీలకు జిల్లా బాక్సర్ల ఎంపిక
అభినందించిన జేసీ సేతు మాధవన్

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించిన జిల్లా బాక్సింగ్ క్రీడా కారులను జేసీ ఎస్.సేతు మాధవన్ అభినందించారు. ఏ.యు.స్థాయి లో నవంబరు 15, 16 తేదీల్లో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా బాక్సింగ్ క్రీడాకారులు సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జాయింట్ కలెక్టర్‌ను కలిశారు. 46-48 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించిన ఎస్.తేజస్వి, 48-51 కిలోల విభాగంలో స్వర్ణ పతక విజేత ఏ.సాయి, 52 కిలోల విభాగంలో రజత పతక విజేత ఎస్.కె.సుల్తానా, 93 కిలోల విభాగంలో స్వర్ణ పతక విజేత జి.లిఖిత్ రెడ్డి జె.సి.ని కలిశారు. ఈ సందర్భంగా వారిని జె.సి. అభినందిస్తూ జాతీయ స్థాయిలో పంజాబ్‌లోని భటిండాలో డిసెంబరు 26 నుంచి జరిగే అఖిల భారత విశ్వవిద్యాలయ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. డి.ఎస్.డి.ఓ. వెంకటేశ్వరరావు, బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శివాలయాలు

విశాలాంధ్ర-రామభద్రపురం: కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా రామభద్రపురం, తారాపురం, కొట్టక్కి, నరసాపురం, శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. భక్తులంతా ఉదయం 5 గంటల నుంచి ఆలయా లకు పోటెత్తారు. ఆలయంలో ఉన్న నందీశ్వరుడికి శివునికి పసుపు కుంకుమలతోప్రత్యేక పూజలు చేశారు. ఆల యాల చుట్టూ ఓం నమశ్శివాయ అంటూ ప్రదక్షిణ చేశారు.

వైకాపా నేతల పరామర్శ

విశాలాంధ్ర-రాజాం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చెంపేటలో వైసీపీ నాయ కులు పిట్టా జగదీష్ కు ఇటీవల కాలు శస్త్రచికిత్స జరిగింది. ఈ సందర్భంగా టౌన్ వైకాపా నాయకులు పాలవలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాబూరావు, రామినాయుడు, పార్వతీరావు, రాము, అప్పలనాయుడు, తమ్మయ్య, మోహనరావు, లక్ష్మణ, సింహాచలం తదితరులు పరామర్శించారు.

నిజాయితీ చాటుకున్న దంపతులు

విశాలాంధ్ర -బొబ్బిలి: గృహిణికి దొరికిన తులంన్నర బ్రాస్లెట్ ని తన భర్త ద్వారా పోగొట్టుకున్న వారికి స్థానిక పట్టణ సీఐ కటకం సతీష్ కుమార్ సమక్షంల అప్పగించిన దంపతులను పోలీసులతో స్థానికులు అభినం దించారు. పట్టణం దిబ్బ వీధి శివాలయం దగ్గర ఆదివారం రాత్రి కింతలి నరసింహమూర్తి బ్రాస్లెట్ ను పోగొట్టుకున్నారు. 8వ వార్డు చెరువు గట్టుకు చెందిన మారోజు శంకరరావు భార్య కు ఆ బ్రాస్లెట్ దొరికింది. శివాలయం పంతులకి చెప్పి ఆరా తీశారు. నరసింహమూర్తి వస్తువు పోయిందని పంతులకి చెప్పడంతో వెంటనే ఆయనకు సమాచారం ఇవ్వడంతో నిర్ధారణ చేసుకొని ఆ బ్రాస్లెట్ ని అతనికి అప్పగించారు. మారోజు శంకరరావు దంపతుల నిజాయితీని సిఐ సతీష్ కుమార్ ప్రశంసించి వారిని అభినందించారు.

బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలి
జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నిర్వహించారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 31 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 9, కుటుంబ కలహాలకు సంబంధించి 4 ఫిర్యాదులు, మోసాలకు పాల్పడినట్లుగా 7 ఫిర్యాదులు, ఇతర విషయాలకు సంబంధించినవి 11 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలోచర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలనిఅధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, ఎస్బీ సిఐ ఎ. లీలారావు, డిసిఆర్బి ఎస్ఐ రాజేష్ మరియు ఇతరపోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇవ్వాలి
వ్య.కా.స జిల్లా అధ్యక్షుడు కందేపల్లి దేవుడు

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: పేదలకు గ్రామాలలో 3 సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందేపల్లి దేవుడు కుటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం సచివాలయం రెండు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హయాంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు, పట్టణాల్లో 1 సెంటు చొప్పున ఇళ్లస్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందని. ఆయా ఇళ్లస్థలాలు పట్టణాలకు సుదూరంగా నివాసయోగ్యంకాని ప్రాంతాలలో కేటాయించడం జరిగిందని. అందులో చాలామం పేదలకు ఇప్పటివరకు ఇళ్లస్థలాలు చూప లేదని ప్రభుత్వం ఇచ్చే 1 సెంటు స్థలం పేదల నివాసానికి ఏమాత్రం సరిపోదని సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆనాడే వైసిపి ప్రభుత్వానికి చెప్పినప్పటికీ ఖాతరు చేయకుండా నాటి ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లింది. కాకి లెక్కలతో 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు యిచ్చి నప్పటికీ పేదలు ఆ స్థలాలపట్ల సుముఖత చూపలేదని. పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం రూ.1,80,000/-లు మాత్రమే ప్రకటించారని. ఆ ఆర్థిక సహాయంతో పునాదులు కూడా పూర్తిచేయలేమని పేదలెవ్వరూ కూడా ఇంటి నిర్మాణం చేపట్టలేదని. వైసిపి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాలు, పట్టాలు నిరుపయోగంగా మారాయని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామనిహామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ముఖ్యమంత్రి అదేవిధంగా హామీ ఇస్తూ, ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షల చొప్పున ఇస్తామని చెప్పడం జరిగిందని. ఇంటి స్థలాల కేటాయింపుపట్ల చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూలమే. సిమెంటు, ఇసుక, ఇటుక, ఇనుము, కంకర తదితర సామాగ్రి ధరలు పెరిగిన రీత్యా రూ. 5 లక్షలకు పెంచి గృహ నిర్మాణానికి మంజూరు చేయాలని. పేదల ఇళ్ల నిర్మాణానికి మెటీరియల్ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి. ఇళ్లస్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో, గ్రామాల్లో నివాసయోగ్యంగా, గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించాలి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన లే-అవుట్లను మార్పుచేసి పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్లస్థలాలను కేటాయించాలని. రోడ్లు, విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజీ పారుదల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని. పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్ల నిర్మాణం కోసం సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపుమేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ/వార్డు సచివాలయాల వద్ద పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించి, ఆందోళన కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శిలు శ్రీను రాము తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-తెర్లాం: మండలం లో సోమవారం కూనాయి వలస గ్రామ సర్పంచ్ బోడేల విజయబాబు, సచివాలయం సిబ్బంది సెక్రటరీ వినోద్, వి ఆర్వో శకుంతలను కలసి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బోడేల రామయ్య ఆధ్వర్యంలో ఆ గ్రామ పేదవాళ్ళయిన ప్రజలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు అందజేసారు. సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా పేదల కోసం గ్రామాలలో 3సెంట్లు, పట్టణాలలో 2 సెంట్లు ఇల్లు స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు చొప్పున మంజూరు చేయాలని కోరుతున్నామని బోడేల రామయ్య అధికారులను కోరారు. కార్యక్రమంలో తనతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

విజయనగరం

పేజి : 2

మంగళవారం 19, నవంబర్ 2024

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

ఇరిగేషన్ ఎఇ సంతోష్

విశాలాంధ్ర-జామి: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 22, 23 తేదీలలో జరగవలసిన నీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడినట్లుగా ఇరిగేషన్ ఎఇ సంతోష్ తెలిపారు. మండలంలోని 14 మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, 5 మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎన్నికలకు జరగాల్సి వుందన్నారు. ఎన్నికలకు సంభందించి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను సైతం సిద్ధం చేసామన్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ ఎంపిక పూర్తియిందన్నారు. కానీ ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికలను వాయిదా వేశామని వివరించారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది ప్రభుత్వం ప్రకటించిన వెంటనే ఓటర్లును ఎన్నికలకు సిద్ధం చేస్తామని

విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు కలెక్టర్ అభినందన

నగదు బహుమతులు అందజేసిన కలెక్టర్ డా. అంబేద్కర్

బాలికల సంరక్షణపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: అంతర్జాతీయ బాలికా సంరక్షణ దినోత్సవం సందర్భంగా అక్టోబరు 11వ తేదీన జిల్లా స్థాయిలో పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వలు పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ అభినందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖతో కలసి బాలికా సంరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలను నిర్వహించాయి. యీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జిల్లా కలెక్టర్ సంభాషించారు. వారు ఏ అంశంపై చిత్రాలు వేసిందీ తెలుసుకున్నారు. ఒక్కో విభాగంలో ప్రథమ బహుమతి విజేతకు రూ.5000, ద్వితీయ బహుమతి విజేతకు రూ.3000, తృతీయ బహుమతి విజేతకు రూ.2000 వంతున నగదు బహుమతులు అందజేశారు. వక్తృత్వ పోటీల్లో వి.లతాశ్రీ(బి.సి.సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తవలస), టి.లావణ్య(జెడ్.పి.హైస్కూల్, వంగర), ఎం.రమ్య(కె.జి.బి.వి, గుర్ల) వరుసగా ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో పి.పరిమళ(ఏ.పి.సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, చీపురుపల్లి), వి.ప్రత్యూశ్రీ(ఏ.పి.మోడల్ స్కూల్, షికారుగంజి), వి.భాగ్యశ్రీ(జెడ్పీ హైస్కూల్, కొట్యాడ) వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. చిత్రలేఖనంకు సంబంధించి ఎం.గౌతమ్(జెడ్పీ హైస్కూల్, దేవాడ), జి.జ్యోతి(కె.జి.బి.వి, గుర్ల), జి.మేఘన(బి.సి.సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తవలస) వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు, డి.ఎం.హెచ్.ఓ. డా.రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి, కుళాయి పన్నుల మొండి బకాయిలను ఉపేక్షించబోము

నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: ఆస్తి కుళాయి పన్నుల మొండి బకాయిలను ఉపేక్షించబోమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. పన్నుల వసూళ్లకై ఆయన ప్రత్యేక కార్యాచరణ ను ఆదేశించిన నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులు బృందాలుగా ఏర్పడి పన్నులను రాబడుతున్నారు. ముఖ్యంగా మొండి బకాయిలపై దృష్టి సారించి వారి నుండి పన్నుల వసూళ్ల కై కృషి చేస్తున్నారు. పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. కుళాయి పన్నులు ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్నట్లయితే తక్షణమే చెల్లించాలని కోరగా కొంతమంది ఏక మొత్తంలో బకాయి పడ్డ పన్నులను చెల్లిస్తున్నారు. అలా కాని ఎడల కుళాయి కనెక్షన్లను సిబ్బంది తొలగించి వేస్తున్నారు. మరల కుళాయి కనెక్షన్ పొందాలంటే వ్యయ ప్రయాసలు ఎదుర్కోవాల్సి ఉంటుందని సిబ్బంది తెలియజేస్తున్నారు. పన్నుల వసూలుకై ప్రత్యేక కార్యాచరణ నుద్దేశించి కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ పన్నుల మొండిబకాయిలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమని స్పష్టం చేశారు. మొండి బకాయిల పట్ల ప్రత్యేక దృష్టి సారించామని, ప్రతి ఒక్కరూ పన్నులు సకాలంలో చెల్లించవలసిందేనని తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలన్నా, నగరం అభివృద్ధి చెందాలన్నా ప్రజలు చెల్లించే పన్నులతోనే సాధ్యమన్న విషయాన్ని గమనించాలని కోరారు.

జీవితంలో ఉన్నత లక్ష్యాల సాధనపై గురిపెట్టాలి

- డిఎస్సీతోపాటు జాతీయస్థాయి పోటీపరీక్షలకు సన్నద్ధం కండి
- కెరీర్ గైడెన్స్ చేసిన కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉన్నత విద్య పూర్తిచేసిన యువత జీవితంలో సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత లక్ష్యాల సాధనపై గురిపెట్టి వాటిని సాధించేందుకు ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ సూచించారు. సివిల్స్ పరీక్ష కష్టతరమని భావించవద్దని, ఇది అత్యంత సులువైనదని, ఇతర పోటీ పరీక్షల కంటే యీ పరీక్షకు పోటీ తక్కువని చెప్పారు. ఢిల్లీలో సివిల్స్ శిక్షణకు మన రాష్ట్రం నుంచి వేలాది మంది అభ్యర్థులు వెళుతున్నా వారు అందులో సఫలం కాలేకపోవడానికి కారణం వారు శిక్షణపై ఏకాగ్రత చూపకపోవడమేనన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ లక్ష్యాల సాధనకు ప్రయత్నించాలన్నారు. ఉపాధ్యాయ నియామక రాతపరీక్షకు సన్నద్ధమవుతూనే జాతీయ స్థాయిలో నిర్వహించే వివిధ రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. యువతకు జీవితంలో ఇది ఎంతో కీలకమైన సమయమని, కాలాన్ని వృధా చేయకుండా తమ లక్ష్య సాధనపైనే ఏకాగ్రత కనబరచాలన్నారు. బి.సి.సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురజాడ అప్పారావు బి.సి. స్టడీ సర్కిల్ ద్వారా మెగా డి.ఎస్.సి. పరీక్ష రాసే బి.సి. అభ్యర్థులకు అందిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం నగరంలోని కస్పావీధి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.ఎస్.సి. అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పోటీ పరీక్షలను ఎదుర్కోవడంలో తన అనుభవాలను వివరించడంతోపాటు పరీక్షలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై వారికి కొన్ని మెళకువలను తెలిపారు. గతంతో పోల్చినట్లయితే నేడు ప్రభుత్వం ఉచిత శిక్షణతోపాటు స్టయిపెండ్ ఇస్తూ స్టడీ మెటీరియల్ కూడా అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించే బాధ్యత అభ్యర్థులపైనే వుంటుందన్నారు. యువత తమ మేథస్సును, తెలివితేటలను సక్రమరీతిలో ఉపయోగించుకొంటూ పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. ఈ శిక్షణ పొందడం ద్వారా పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలనే పద్ధతులు మాత్రమే తెలుస్తాయని, పరీక్షలకు పూర్తిస్థాయిలో చదివి తగిన విజ్ఞానం పొందినపుడు మాత్రమే ఆశించిన ఫలితాలు సాధించగలమన్నారు. జిల్లా బి.సి.సంక్షేమ అధిరాని పెంటోజీ మాట్లాడుతూ బి.సి.స్టడీ సర్కిల్ ద్వారా 182 మందికి రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. ఒక్కో అభ్యర్థికి రూ.1000 విలువైన స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు నెలకు రూ.1500 స్టయిపెండ్‌గా అందించనున్నట్లు చెప్పారు. ఎస్.జి.టి. పరీక్ష శిక్షణకు 152 మంది, స్కూల్ అసిస్టెంట్ శిక్షణకు 30 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ బి.సి.సంక్షేమాధికారి యశోధన రావు తదితరులు పాల్గొన్నారు.

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

104 సిబ్బంది ఎంపీపీకు వినతి

విశాలాంధ్ర-గుర్ల: గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 104 సిబ్బంది ఎంపీపీ పొట్నూరు ప్రమీల స్వగ్రామమైన పాలవలసలో సోమవారం తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి నెల నెల సక్రమంగా జీతాలు చెల్లించక కుటుంబాలను పోషించటం చాలా కష్టం అవుతుంది అని వాపోయారు.104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ద్వారా కేవలము 50 వేలు రూపాయల ఖర్చు తో నిర్వహించి ప్రజా దనము వృధాకాకుండా చూడాలి అని 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి. యఫ్ తిరిగి చెల్లించాలి అని 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలి అని డి.యస్సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్ లను కాంట్రాక్టు లో పెట్టాలి అని ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలి అని ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు డ్రైవర్ రవి కిషోర్ రాజు, డీఈఓ ఎస్.శ్రీను పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుర్ల మండలంలో తెట్టంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 104 సిబ్బంది. సోమవారం ఎంపీటీసీ సభ్యులు బూర్లి జోగినాయుడు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి నెల నెల సక్రమంగా జీతాలు చెల్లించక కుటుంబాలను పోషించటం చాక కష్టం అవుతుంది అని వాపోయారు.104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలము 50 వేలు రూపాయల ఖర్చుతో నిర్వహించి ప్రజా దనము వృధాకాకుండా చూడాలి అని 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి.యఫ్ తిరిగి చెల్లించాలి అని 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలుచెయ్యాలి అని డి. యస్సి ద్వారా నియమితులు అయిన సీనియర్ డ్రైవర్ లను కాంట్రాక్టు లో పెట్టాలి అని ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలి అని ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు డీఈఓ కొట్టడ గోవిందు,డ్రైవర్.గాంగారపు నాగరాజు పాల్గున్నారు.

ప్రధాన కాలువలలో పూడికతీత పనులు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: నగరంలోని ప్రధాన కాలువలలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి జెసిబిలు సహాయంతో పూడికతీత పనులను చేపడుతున్నారు. పండగల సీజన్ కావడంతో ఈ మధ్యకాలంలో పళ్ళు, పూలు,ఇతర సామాగ్రి క్రయవిక్రయాలు ప్రధాన రహదారులలో జోరుగా సాగాయి. దీంతో చెత్తాచెదారాలు ఎక్కువగా ప్రధాన కాలువల్లో చేరుకున్నాయి. కాలువ నీరు ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో గమనించిన కమిషనర్ తక్షణమే చెత్తాచెదారాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన జెసిబిలు, బాబ్ కార్ట్ ల సహాయంతో పూడికలను తొలగించి వేస్తున్నారు. అలాగే క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ట్యాంక్ బండ్ రోడ్డు, తోట పాలెం తదితర ప్రాంతాల్లో కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యటించారు. ఎల్ఐసి బిల్డింగ్ ఎదురుగా ఉన్న ప్రధాన కాలువలో పూడిక చేరడానికి గమనించిన ఆయన వెంటనే చెత్త చెదారాలను తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు.

రీ సర్వేలో వచ్చిన తప్పులను పరిష్కరించుటకే

రెవెన్యూ సదస్సులు : ఆర్ఎస్‌డిటి రవికిరణ్



విశాలాంధ్ర-తెర్లాం: సోమవారం మండలంలో కుమ్మరిపేట, జెన్నీవలస గ్రామాలలో నిర్వహించిన రీ సర్వే సదస్సులలో ఆర్. ఎస్‌డిటి రవికిరణ్, మండల సర్వేయర్ వి సాయిరాం మాట్లాడుతూ రీ సర్వేలో వచ్చిన తప్పులను సరిచేయుటకే రెవెన్యూ సదస్సులని కావున వీటినే రైతులు తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఈ గ్రామాల్లో ఎక్కువగా ఎల్పిఎంలకు స్ప్లిటింగులు కావాలని దరఖాస్తులు వచ్చాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఎస్ నరసింహా నాయుడు, వీఆర్వో బృందం, సర్వే బృందం, రైతులు రిటైర్డ్ వీఆర్వో ముచ్చి సత్యనారాయణ, నాయకులు భాస్కర రావు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం వ్యాసరచన పోటీలు



విశాలాంధ్ర-శృంగవరపుకోట: పట్టణములోని శాఖా గ్రంథాలయంలో 57వ,జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, డిబేట్ మొదలగు నిర్వహించడం జరిగిందని శాఖ గ్రంథాలయ అధికారి దామోదర్ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా బొడ్డవర హై స్కూల్ టీచర్ శ్రీదేవి, గవర్నమెంట్ హై స్కూల్ టీచర్ వి. మల్లేశ్వర రావు, గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ పి ఈ టి విజయ శాంతి, శ్రీనివాస్ కాలనీ ఎలిమెంట్ స్కూల్ టీచర్ శ్రీ దాసరి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరిగిందని నిర్వహించబడినది. కార్యక్రమంలో పాఠకులు తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

ఆక్రమణలు తొలగింపు ...

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: విజయనగర పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా అవసరమైన రక్షణా చర్యలను చేపడుతున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం టౌన్ సెంటర్ లేఅవుట్ నందు పార్కు స్థలంలో ఆక్రమణలను తొలగించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి ,టిపియస్.అనిత,పారిశుధ్య పర్యవేక్షకుల బృందంతో కలిసి జెసిబిల సహాయంతో ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, ఆక్రమణలకు గురికాకుండా తగిన రక్షణ చర్యలు చేపడతామన్నారు. అలాగే ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లు గుర్తిస్తే అట్టి వారిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఫుట్ పాత్ లను ఆక్రమించి వ్యాపారాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. రామారాయుడు రోడ్డు ప్రాంతంలో ఉన్న ఫుట్ పాత్ పై ఉన్న భోజనశాలను ప్రణాళిక సిబ్బంది అక్కడినుండి తరలించి వేశారు. ఫుట్ పాత్లను ఆక్రమించి చిరు వ్యాపారాలు చేపట్టరాదని తెలిపారు.

స్పీడ్ బ్రేకర్స్ వేయండి, ప్రమాదాలను నివారించండి

జనసేన నాయకులు త్యాడ రామకృష్ణారావు

విశాలాంధ్ర- విజయనగరం పోర్ట్ : స్థానిక 42 డివిజన్ పరిధిలో ఉన్న కామాక్షి నగర్ చైతన్య స్కూల్ వద్ద అయ్యన్నపేట జంక్షన్ వద్ద తరుచుగా వాహనాలు ప్రమాదాలతో ప్రజలంతా తీవ్ర గాయాలతోను, కొన్ని సార్లు మరణాలతోను చాలా ఇబ్బందులపాలు అవుతున్నారని,తక్షణమే స్పీడ్ బ్రేకర్స్ వేసి ప్రమాదాలను అరికట్టాలని సోమవారం ఉదయం ప్రజా వినతులు పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కు జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు(బాలు) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రోడ్లు మరియు భవనాల శాఖ వారికి జాతీయ రహదారుల శాఖ వారికి అయ్యన్నపేట జంక్షన్ వద్ద, చైతన్య స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ వేయించమని పలుమార్లు వినతి పత్రములు ఇచ్చినా వారు పట్టించుకోలేదని, ప్రస్తుతం ఎక్కువగా అక్కడ ప్రమాదాలు జరిగి కొందరు వాహనదార్లు చనిపోవడం, ఆసుపత్రిపాలు అవడం జరుగుతుందని,స్థానిక ప్రజలందరి కోరికమేరకు అయ్యన్నపేట జంక్షన్ వద్ద మరియు కామాక్షి నగర్ చైతన్య స్కూల్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ వేయించి ప్రమాదాలని అరికట్టి సహాయపడగలరని జనసేన పార్టీ తరుపున కోరామని, కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులకు చూడమని ఆదేశించారని తెలిపారు.

ప్రయాణాలప్పుడు ఆభరణాలు జాగ్రత్తగా చూసుకోవాలి

విశాలాంధ్ర- రామభద్రపురం: మహిళలుబస్సుల్లో ప్రయాణించే టప్పుడు ఆభరణాలు అనుక్షణం చూసుకుంటూ ఉండాలని స్థానిక ఎస్సై వెలమల ప్రసాదు అన్నారు. సోమవారము మండల కేంద్రంలో ఆర్టిసి కాంప్లెక్సో ప్రయాణం చేసే మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు ప్రయాణం చేసేటప్పుడు పర్సు, శర్వాణి, మెడలో ఉన్న ఆభరణాలు జాగ్రత్తగా ఉంచుకోవాలని అన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఉంటే తక్షణమే పోలీసులు సంప్రదించాలని అన్నారు. ముఖ్యంగా బస్సులు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు తగుజాగ్రత్త వహిస్తే సరిపోతుందని అన్నారు. అజ్ఞాతవాక్తులతో మాట్లాడేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బయట వ్యక్తులను ఎక్కువగా నమ్మవద్దని అన్నారు. మహిళలు ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్యకళాశాలలో "ఆరంభ - 2కె24" పేరున ఫ్రెషర్స్ డే



విశాలాంధ్ర -గరివిడి: పట్టణంలో పోష వైద్య కళాశాలలో సోమవారం ఫ్రదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డా. వై. సింహాచలం ముఖ్య అతిథిగా పాల్గొని 2024 వ సంవత్సరంలో నూతనంగా గరివిడి పశువైద్య కళాశాలలో చేరిన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు పశువైద్యం లో తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకొని రానున్న రోజులలో మంచి పశువైద్యాధికారులు గా మారి మూగజీవాలకు పశుపోషకులకు తమ సేవలను అందించాలన్నారు. ఈ సందర్భంగా పశువైద్య కళాశాల నూతన భవనాన్ని సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గరివిడి పశు వైద్యకళాశాల అసోసియేట్ డీన్ డా. మక్కెన శ్రీను, విశ్రాంత ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్, శ్రీ పప్పు భోగారావు, చీపురుపల్లి డిప్యూటీ సివిల్ సర్జన్, డా. జి. అర్చన పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం, ఆటల పోటీలు

విశాలాంధ్ర-తెర్లాం: స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం జాతీయ గ్రంథాలయ ఉత్సవా లలో భాగంగా ప్రతి విద్యార్థి చిత్రలేఖనాన్ని హ్యాబిగా మార్చుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి సిహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ చిత్రలేఖనం పోటీలు చిన్నారులతో వారికి నచ్చిన బొమ్మలు వేయించి వాటికి రంగులు దిద్దించారు. చదువుతోపాటు చిత్ర లేఖనంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించడం జరిగిందని మరియు క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని క్రాఫ్ట్ టీచర్ కె. విస్సు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ వై శ్రీదేవి పాఠకులు పాల్గొన్నారు.

శివాలయం వద్ద నగర సంకీర్తనలు

విశాలాంధ్ర-గుర్ల : మండల కేంద్రంలోని శివాలయం వద్ద దీక్ష చేసిన శివ స్వామి కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా గ్రామంలో సోమవారం నగర సంకీర్తనలు పాడారు. హరే రామ, హరే కృష్ణ సంకీర్తనలు పాడుకుంటూ తాళాలు, డబ్బులు కొడుతూ కీర్తనలు పాడారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం గ్రామ పుర వీధుల్లో తిరుగుతూ సంకీర్తనలు పాడడం ఆనవాయితీగా వస్తుందని గురుస్వామి నెరడబిల్లి ఈశ్వరరావు, అంబటి లక్ష్మణ చెప్పారు.

యశస్వినికి జనసైనికుల సన్మానం

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్ : తూర్పు కాపు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవిని చేపట్టిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విగారిని ఘనంగా సన్మానించిన ఎస్.కోట జనసేన నియోజకవర్గ ఇన్చార్జి వబ్బిన సత్యనారాయణ, సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వబ్బిన సన్యాసి నాయుడు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా ఎస్.కోట జనసేన పార్టీకి, రాష్ట్రంలో తూర్పు కాపులందరి అభివృద్ధికి, యశస్వి గారుకృషి చేస్తారని తామంతా భావిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమం లో సుంకర అప్పారావు, గొరపల్లి రవి ,పిల్ల రామధుర్గ, మల్లువల్స శ్రీను, శేక్ ఫిరోజ్, జామి రాజు, పట్రాన రవి,రుద్ర నాయుడు , వీరమహిళా వెంకటలక్ష్మి,తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

వర్సిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

జేఎన్టీయూ ఇన్చార్జ్ విసి రాజ్యలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: యూనివర్సిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ డి రాజ్యలక్ష్మి అన్నారు సోమవారం జేఎన్టీయూ యూనివర్సిటీలో ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్ ల సమావేశం జరిగింది. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రిన్సిపల్స్ తమ యొక్క సలహాలు, సూచనలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా "ఐడియా క్లబ్" ను ఏర్పాటు చేసారు. కార్యక్రమములో ఇంచార్జి వైస్ - ఛాన్సలర్ ప్రొఫెసర్. డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూయూనివర్సిటీ ని అభివృద్ధిపథంలో నడిపించటానికి ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటానికి ప్రతీ అధ్యాపకుడు కృషి చేయాలన్నారు. ప్రయత్నిస్తే సాధించలేనిది ఏమి లేదని, ప్రతీ విద్యార్థిని ఉన్నతమైన స్థితిలోకి తీసుకుని వెళ్ళడానికి ప్రతీ ఫ్యాకల్టీ మెంబర్ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్. జాస్తి ఆనంద్ చందూలాల్ మాట్లా డుతూ ఆలోచన, అవగాహన, ఆచరణ తోటి ముందుకు సాగితే అద్భుతాలు సాధించవచ్చన్నారు. అవగాహన లేని పని అసంపూర్తిగా మిగిలిపోతుం దన్నారు. ప్రారంభించిన పనిని లక్ష్యాన్ని సాధించే దిశగా తీసుకుని వెళ్ళాలనే పట్టుదల ఉండాలని, అప్పుడే పెట్టుకున్న లక్ష్యానికి చేరుకోగలమని తెలియజేశారు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ మాట్లాడుతూ, సమిష్టి కృషితో భాధ్యతగా పని చేస్తే సాధించలేనిది ఏది లేదన్నారు. ప్రతీ ఫ్యాకల్టీ మెంబర్ విద్యార్థులను ఉన్నత ఉద్యోగాలు సాధించే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. ప్రతీ ఒక్కరు ఇచ్చిన సలహాలను, సూచనలను అనుసరించి యూనివర్సిటీ ని ముందుకు తీసుకుని వెళ్లడానికి కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్ ప్రొఫెసర్. ఆర్ రాజేశ్వరరావు,అడ్మిషన్స్, ఎవాల్యూషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ కే బాబులు, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్. కె.సి.బి. రావు , డైరెక్టర్ ఆఫ్ అలుమ్ని రిలేషన్స్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్, అండ్ ప్లేస్మెంట్స్ డాక్టర్. జీవి నాగరాజు,వివిధ ఇంజనీరింగ్,ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్ లు,వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు రవాణా, కళాసీ చార్జీలు చెల్లించాలి

విశాలాంధ్ర-బొబ్బిలి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ ద్వారా 2021-22 ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతులకు రవాణా, కళాసీ చార్జీలు చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. రవాణా, కళాసీ చార్జీలు చెల్లించాలని కోరుతూ సోమవారం పిఎసిఎస్ సెక్రెటరీ వి.తమ్మినాయుడును కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మిన రైతులకు రవాణా, కళాసీ చార్జీలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, 2021-22 ఖరీఫ్ సీజన్లో రైతులకు చెల్లించలేదన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తే ప్రభుత్వం కళాసీ చార్జీలు కోసం రూ.10కోట్లు, రవాణా చార్జీలు కోసం రూ ఎం12కోట్లు నిధులు జిల్లాకు విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ జిల్లా అధికారులు పిఏసిఎస్ కేంద్రాలకు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటి వరకు కళాసీ చార్జీలు కోసం రూ.10కోట్లు విడుదల చేస్తే రైతులకు ఇవ్వలేదని ఆరోపించారు. తక్షణమే కళాసీ చార్జీలు రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేయాలని, రవాణా చార్జీలకు రూ.12కోట్లు బకాయిను జిల్లా అధికారులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా ఇవ్వకపోవడంతో పెట్టుబడులు కోసం రైతులు అప్పులు చేశారని, పిఏసిఎస్ అధికారులు స్పందించి కళాసీ చార్జీలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాల వారీగా రైతులకు చెల్లించాలని కోరారు. లేనిచో ఆందోళన చేస్తామన్నారు. దీనిపై సెక్రెటరీ తమ్మినాయుడు స్పందిస్తూ వారం రోజులలో రైతుల జాబితా సిద్ధం చేసి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.శంకరరావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు యు.ప్రసాద్, రెడ్డి త్రినాధ ఉన్నారు.

విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమమే లక్ష్యంగా పనిచేద్దాం

ఏపిటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మావతి

విశాలాంధ్ర-బొబ్బిలి: విద్యారంగ పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ ఉపాధ్యాయ సంక్షేమం,,సమాజ శ్రేయస్సు లక్ష్యంగా ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రేణులు ,కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి పద్మావతి పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక ఏ పి టి ఎఫ్ కార్యాలయంలో జిల్లా గౌరవాధ్యక్షులు బంకురు జోగినాయుడు అధ్యక్షతన ఏ పి టి ఎఫ్ జోనల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటికి విద్యారంగంలో ఆశాస్త్రీయమైన, అసమంజసమైన విధివిధానాలను ప్రభుత్వాలు కొనసాగిస్తూ విద్యను కుంటుపరుస్తున్నాయని వాటిని ఎదుర్కొనేందుకు పోరాటాలు, ఉద్యమాల ద్వారానే విద్యా పరిరక్షణ సాధ్యమన్నారు..రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జె సి రాజు మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందిస్తున్న సంస్కరణలలో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలు లేకుండా చేయటం సమంజసం కదాన్నారు. గత ప్రభుత్వం 6 స్థాయిల విద్యావ్యవస్థను ప్రవేశపెట్టి విద్యార్థులను, తల్లితండ్రులకు గందరగోళంలోకి నెట్టిందని మళ్ళీ ఇప్పుడు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలే ఉంటాయని ప్రాథమికోన్నత పాఠశాలలు లేకుండా చేయటం సమాజ హితం కాదన్నారు. సుదూర ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తున్న శిక్షణా శిక్షణా కార్యక్రమాలను రద్దుచేసి జిల్లా కేంద్రాలలో నిర్వహించేలా విద్యా శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం మధ్యలో పని సర్దుబాటును విరమించుకోవాలని పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పి ఎఫ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధమండలాల నాయకులు ఎల్లయ్య, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, రామ కృష్ణ, రమేష్, చంద్ర నాయుడు,రామ మూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.